క్లుప్తంగా

గురువులకు సత్కారం


విజ్ఞానభారతి స్కూల్‌లో గురువులను సత్కరిస్తున్న సురేష్ తదితరులు

రామచంద్రపురం: తాము చదువుకున్న పాఠశాలను పూర్వ విద్యార్థులు మర్చిపోలేదు. వారికి విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను సత్కరించారు. జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని తమ గురువులను యువకులు సత్కరించుకుని పలువురికి ఆదర్శంగా నిలిచారు. స్థానిక విజ్ఞానభారతి స్కూల్‌లో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు జాతీయ యువజనోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు రెడ్డి సురేష్, కృష్ణమూర్తిల నేతృత్వంలో తమ గురువులను ఘనంగా సత్కరించుకుని ఆశీస్సులు తీసుకున్నారు. తొలుత స్వామి వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల హెచ్‌ఎం వి.వెంకన్నబాబు మాట్లాడుతూ వివేకానందుని జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భోగి మంటల్లో బిల్లులు వేసి నిరసన తెలపాలి


కాజులూరులో ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీపీఎం నాయకులు

కాజులూరు: విద్యుత్ చార్జీల పెరుగుదలకు నిరసనగా సోమవారం కరెంటు బిల్లులు భోగి మంటల్లో వేసి నిరసన తెలిపాలని సీపీఎం మండల కన్వీనర్, ఏపీ కౌలు రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు మండల గ్రామాల ప్రజలకు పిలుపునిచ్చారు. మండలంలోని కాజులూరు, శీల, శీలలంక చేదువాడ, తర్లంపూడి, మామిడాడ తదితర గ్రామాల్లో పర్యటించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై కరపత్రాలు పంచుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. రాష్ట్రంలో ట్రూఅప్ చార్జీల పేరుతో కరెంటు బిల్లులు పెంచి సామాన్యులపై భారం వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నామ చంద్రరావు, నామ నాగబాబు, యాళ్ల కృష్ణ, వగ్రే సత్యనారాయణ, చీకట్ల చిన్నబాబు, యాళ్ల పాండవులు, యాళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేడు విజయదుర్గా పీఠంలో పౌర్ణమి పూజలు

రాయవరం: వెదురుపాక విజయదుర్గ పీఠంలో సోమవారం పాల్గుణపౌర్ణమి పూజలు నిర్వహించనున్నట్టు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు తెలిపారు. ఆయన ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ పౌర్ణమి పురస్కరించుకుని విజయ వేంకటేశ్వరస్వామికి తులసి దళ అర్చనలు, విజయదుర్గా అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహిస్తామన్నారు. పీఠంలో జరిగే పౌర్ణమి పూజల్లో భక్తులంతా పాల్గొనాలని ఆయన కోరారు.

మసీదు సందర్శన


వెలంపాలెం మసీదులో ముకరం చాంద్‌ను సత్కరిస్తున్న మసీదు కమిటీ

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెలంపాలెం షాబాజియా జామియా మసీదును వక్ఫ్ బోర్డు రాష్ట్ర డైరెక్టర్ ముకరం చాంద్ ఆదివారం సందర్శించారు. మసీదు కమిటీ మసీదులో సమస్యలను వివరించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరుకు కృషి చేస్తానని మాటిచ్చారు. మసీదు కమిటీ ప్రెసిడెంట్ సయ్యద్ ఫాజిల్, సెక్రటరీ బాబూలాల్ ఆధ్వర్యంలో ఆయనను దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సభ్యులు షేక్ జమాల్ హుస్సేన్, ఎండీ అలీఖాన్, షేక్ మొహిద్దీన్, షేక్ హుస్సేన్, ఎండీ మోయిన్, షేక్ గౌస్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామికి లక్ష తులసి పూజ


స్వామివారికి పూజ చేస్తున్న పండితులు

కపిలేశ్వరపురం: అంగరలోని శ్రీరుక్మిణీ సత్యభామా సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం లక్ష తులసి పూజ నిర్వహించారు. అర్చకులు స్వామిని విశేషంగా అలంకరించారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


తోటవారి వీధిలో కొలువైన ధనమ్మ తల్లి


ఆకట్టుకున్న గంగిరెద్దుల ఆటలు


పసలపూడిలో భోగిమంటకు కలప సేకరించిన చిన్నారులు


భోగిదండలు కొనుగోలు చేస్తున్న మహిళ

పల్లెల్లో పూర్తయిన ఏర్పాట్లు

- జాతరలు, ప్రభల తీర్థాలు
- ఆత్మీయ కలయికలు


భోగి మంటల వద్ద అమ్మాయిల సందడి (ఫైల్)

రామచంద్రపురం: సంక్రాంతికి గ్రామాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. తొలిరోజు భోగినాడు వేసే మంటకు కావలసిన కలప సేకరణను చిన్నారులు, యువకులు పోగు చేశారు. చిన్నారులు ఆవుపేడతో నెల నుంచి చేసిన భోగి పిడకల దండలను సిద్ధం చేసుకున్నారు. అలాగే యువకులు మంటకు కావలసిన కలపను సేకరించే పనిలో తలమునకలయ్యారు. వందల ఏళ్ల నాటి జాతరలు, తరతరాలుగా వస్తున్న వంశపారంపర్య సంప్రదాయాలు, ఎన్నో ఏళ్లుగా మోస్తున్న ప్రభల తీర్థాలు.. ఎక్కడో ఉన్న అయినవాళ్లు రావడం, స్నేహితులను కలుసుకోవడం... ఆత్మీయ పలకరింపులు ఇలా పల్లెల్లో పండగ మూడు రోజులు కనిపించే దృశ్యాలే.. వీటితో పాటుగా వందల ఏళ్ల నాటి సాంస్కృతిక సంప్రదాయాలను మోసుకువచ్చేదే సంక్రాంతి. నేటి భోగితో పండగ మొదలు కానుంది.

వందల ఏళ్లుగా అమ్మవారి జాతరలు

నూతన వస్త్రాలు ధరించి భోగి మంటలు వేయడం, పూర్వీకులకు పండగ పేరుతో తర్పణాలు పెట్టడం, పశువులను అలంకరించటం, గాలిపటాలు వేయటం ఇవే కాకుండా నియోజకవర్గంలోని మూడు మండలాల్లోను కొలువైన అమ్మవార్లకు సంక్రాంతి మూడు రోజులు భారీ ఎత్తున జాతర్లు నిర్వహిస్తుంటారు. పట్టణంలోని తోటవారి వీధిలోని ధనమ్మ తల్లి, కమ్మవారి సావరంలోని గొల్లాలమ్మ, వెంకటాయపాలెం, వెల్ల, ఏరుపల్లి, తాళ్లపొలం గ్రామాల్లోని అమ్మవార్లకు ప్రత్యేకంగా పూజలు చేసి జాతరలు నిర్వహిస్తున్నారు.

మూడొందల ఏళ్లుగా శివల ప్రభల తీర్థం

కె.గంగవరం మండలంలోని శివలలో కొలువైన పేరంటాలు పాపమ్మ అమ్మవారు సుమారు మూడువందల ఏళ్లుగా పూజలందుకుంటున్నారు. దంగేరుకు చెందిన ఓబిలినేని వంశీయులు అమ్మవారికి ఏటా తీర్థాన్ని నిర్వహిస్తుంటారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాల్లో భాగంగా భోగినాడు అమ్మవారి ఆలయం వద్ద బోణం నిర్వహిస్తారు. అమ్మవారికి తొమ్మిది రకాల వంటకాలు తయారు చేసి నైవేద్యాన్ని సమర్పిస్తారు. అనంతరం బోణం వేసి మూడురోజుల పాటు నిర్వహించే ప్రత్యేక పూజలను పురస్కరించుకుని దంగేరుకు చెందిన ఓబిలినేని వంశీయులు కుటుంబ సమేతంగా విచ్చేసి ప్రారంభిస్తారు. ప్రతిరోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మూడో రోజైన కనుమ నాడు ప్రభల తీర్థం నిర్వహిస్తారు. సుమారు 20 గ్రామాల నుంచి ఈ తీర్థానికి ప్రభలు తరలివెళతాయి.

కోడి పందాలకు ప్రత్యేకం

పండగ వచ్చిందంటే నియోజకవర్గంలో కోడి పందాలకు పెట్టింది పేరు. గోదావరి తీరం కావటంతో ఏటా కోడి పందాలు పెద్ద ఎత్తున సాగుతుంటాయి. కె.గంగవరం మండలం బ్రహ్మపురి, మసకపల్లి, పేకేరు, కూళ్ల, బాలాంత్రం, యర్రపోతవరం, కాజులూరు మండలం ఆర్యావటం, జగన్నాథగిరి, రామచంద్రపురం మండలంలోని తాళ్లపొలం, వెలంపాలెం, ఉండూరు, ద్రాక్షారామ, పట్టణంలోని కాకినాడ రోడ్డు, పసలపూడి సరిహద్దు ప్రాంతాలు తదితర చోట్ల కొన్నేళ్లుగా కోడి పందాలను నిర్వహిస్తుంటారు. తరతరాలుగా ఈ సంప్రదాయం నియోజకవర్గంలో కొనసాగుతూ వస్తుంది.

ఊరూ వాడా ఉల్లాసంగా..

రాయవరం: తెలుగువారి పెద్ద పండగ సంక్రాంతిని నిర్వహించుకునేందుకు ఊరూవాడా అంతా సిద్ధమైంది. మూడు రోజుల పాటు జరుపుకొనే ఈ పండగలో మొదటిది భోగభాగ్యాలనిచ్చే భోగి పండగ. భోగి మంటలు వేసేందుకు గ్రామగ్రామాన ప్రతి ఇల్లు సన్నద్ధమైంది. గ్రామాల్లో ఎక్కడికక్కడ పండగ వాతావరణం సంతరించుకుంది. ఇప్పటికే పాఠశాలలకు సెలవు దినాలు ప్రకటించడంతో చిన్నారులు అమ్మమ్మల ఇంటికి చేరుకున్నారు. ప్రతి ఇంటి వద్ద గత రెండు రోజుల నుంచే పిండి వంటల హడావుడి ప్రారంభమైంది. జంతికలు, పోకుండలు, అరిసెలు, సున్నుండలు, చల్లగుత్తులు తదితర పిండి వంటలను సిద్ధం చేస్తున్నారు. కొత్త అల్లుళ్లతో ఇళ్లన్నీ సందడిగా మారుతుండగా, మూడు రోజుల పర్వదినంలో మొదటి పండుగైన భోగి పండగకు చిన్నారులు, యువకులు హడావుడి చేస్తున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు పూజారులు ఆలయాలను ముస్తాబు చేస్తున్నారు. మండలంలోని సోమేశ్వరం, మాచవరం, పసలపూడి, వెంటూరు, చెల్లూరు, రాయవరం తదితర గ్రామాల్లో భోగి పండగకు అవసరమైన ఏర్పాట్లలో యువత నిమగ్నమయ్యారు.

భోగ భాగ్యాల భోగిళ్లో...


మొగలిపాలెంలో భోగి మంటకోసం చెట్టు దుంగను లాక్కొస్తున్న చిన్నారులు

కాజులూరు: భోగిళ్లో.. భోగిళ్లో.. భోగ భాగ్యాల భోగిళ్లో అంటూ వాడవాడలా సంక్రాంతి సంబరాలు ఘనంగా మొదలయ్యాయి. ఎప్పుడెప్పుడు పండగ వస్తుందా అని ఎదురుచూసిన కుర్రకారు ఆదివారం అర్ధరాత్రి దాటగానే నెల రోజులుగా సేకరించిన పుల్లా, పిడక ఇతర కలపలతో వీధుల్లో భోగిమంటలు వేశారు. సంక్రాంతి సంబరాలకు స్వాగతం పలికారు. సంక్రాంతి పండగల్లో ‘భోగి’ పండగే తొలిఘట్టం. చిమ్మచీకట్లను చీల్చుకుంటూ వెలుగులు నింపే భోగిమంటలు పాతకు స్వస్తి పలికి కొత్తదనానికి నాంది పలుకుతుందని గ్రామీణ ప్రజల విశ్వాసం. భోగి రోజున ఆవుపేడతో తయారు చేసిన భోగిపిడకలను చిన్నారులు దండలుగా గుచ్చి భోగిమంటల్లో వేస్తారు. మంటల్లో నీళ్లు కాచుకుని తెలవారక ముందే తలారా స్నానం చేసి కొత్త దుస్తులు ధరిస్తారు. చుట్టుపక్కల వారిని పిలిచి తమ ఇంట చిన్నారులకు డబ్బులు, రేగిపళ్లు, పువ్వులు, అక్షతలు కలిపి భోగిపళ్లు పోసే కార్యక్రమం గ్రామాల్లో ఇంటింటా వేడుకగా జరుగుతుంది. మరోసటి రోజే సంక్రాంతి. సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించడంతో మకర సంక్రాంతి పండగను జరుపుకొంటారు. పితృదేవతలకు తర్పణాలు ఇవ్వడంతో పాటు వారి పేరు మీద దుస్తులు, బియ్యం పంపిణీ చేయడం అనాదిగా వస్తున్న ఆచారం. మూడో రోజు జరుపుకొనే కనుమ నాడు గ్రామ దేవతలను పూజించి వారికి నైవేద్యాలు సమర్పిస్తారు. చివరి పండగైన ముక్కనుమ రోజున పాడిని అందించే పశువులకు పూజలు చేస్తారు. సంక్రాంతి లక్ష్మికి వీడ్కోలు పలికేందుకు ప్రతి ఇంటి రథం ముగ్గులు వేస్తారు. ఏటా మరింత ఉత్సాహంగా పండగలు జరుపుకోవాలని సంక్రాంతిని లక్ష్మిని కోరుకుంటారు.

ఉత్సవ్ రన్‌ను ప్రారంభించిన మంత్రి


ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న మంత్రి సుభాష్ తదితరులు

రామచంద్రపురం: సంక్రాంతి ఉత్సవ్–2క25 సంబరాలు పురస్కరించుకొని రామచంద్రపురం ఆర్డీవో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఉత్సవ్‌రన్‌ను కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ జెండా ఊపి ప్రారంభించారు. ఉత్సవ్ రన్ ఆర్డీవో కార్యాలయం నుంచి వీఎస్ఎం కళాశాల క్రీడా ప్రాంగణం వరకు సాగింది. మంత్రి సుభాష్ మాట్లాడుతూ తెలుగువారికి ప్రీతిపాత్రమైన పండుగ సంక్రాంతి అని, సంక్రాంతి విశిష్టతను నేటి తరానికి చాటి చెప్పే విధంగా కనీవినీ ఎరుగని రీతిలో ఏర్పాట్లు చేశామన్నారు. మన పల్లె అందాలు, సంప్రదాయ సంస్కృతులు, నేటి ఆధునిక తరానికి అందించాలనే తపనతో నియోజకవర్గం ప్రజలు సంక్రాంతి పండగను వినూత్నంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో హాట్ బెలూన్ ఎగరవేసి సంక్రాంతి ఉత్సవాలు ప్రారంభించారు. తదనంతరం జరిగిన మెగా ముగ్గుల పోటీని ఆసక్తిగా పరిశీలించారు. ఈ ముగ్గుల పోటీల్లో సుమారు 200 మందికి పైగా మహిళలు పాల్గొన్నారు. గ్రామీణ వాతావరణాన్ని ప్రతిబింబించేలా వీఎస్ఎం కళాశాల ప్రాంగణాన్ని సుభాష్‌నగర్‌గా తీర్చిదిద్దారు. ఏరియా హాస్పిటల్ గేటు దగ్గర విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ గార్డ్స్‌కు మంత్రి సుభాష్ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. అందరినీ పిలిచి ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున సంక్రాంతి కానుకగా అందించారు.

కోడి పందేలు వేస్తే కఠిన చర్యలు


పందెం ప్రదేశంలో ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన అధికారులు

మండపేట: సంక్రాతి పండగను అడ్డం పెట్టుకుని రూరల్ ప్రాంతాల్లో కోడి పందేలు వేస్తే కఠిన చర్య లు తప్పవని రూరల్ సీఐ పి.దొరరాజు, తహసీల్దార్ తేజేశ్వరరావు హెచ్చరించారు. ఆదివారం మండ లంలోని కోడి పందేలు నిర్వహించే పలు ప్రాంతాల ను గుర్తించారు. పేకాట గుండాట కోడిపందేలు నిర్వహించరాదంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటా మని హెచ్చరికలు జారీ చేశారు. ఇప్పటికే 110 మంది పాత నేరస్తులను బైండోవర్ చేశామని సీఐ తెలిపారు.

కోడి పందేల బరుల తొలగింపు


వెంకటాయపాలెంలో ఏర్పాటు చేసిన స్టేజీని తొలగిస్తున్న ఎస్సై లక్ష్మణ్, సిబ్బంది

రామచంద్రపురం రూరల్: పలు గ్రామాల్లో కోడి పందేల కోసం సిద్ధం చేస్తున్న బరులను తొలగించినట్లు ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ ఆదివారం విలేకరులకు తెలిపారు. మండలంలోని ఉట్రుమిల్లి, హసన్‌బాద, వెంకటాయపాలెం గ్రామాల్లో కోడి పందేల కోసం సిద్ధం చేసిన టెంట్‌లు, స్టేజీలను తొలగించారు. ఈ మేరకు ఆయన జూదరులు, కోడి పందేల నిర్వాహకులకు హెచ్చరికలు జారీ చేశారు. హైకోర్టు ఉత్తర్వులు, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సంక్రాంతి పండగ పురస్కరించుకుని ప్రజలు ఒకే ప్రదేశంలో ఐదుగురికి మించి సమీకరించడం, బెట్టింగ్, అక్రమ మద్యం అమ్మకం, జూదం, జంతువులను ఒకచోటికి చేర్చడం వంటివి నిషేధంలో ఉన్నట్లు తెలిపారు. కోడి కాళ్లకు పదునైన కత్తులు, బ్లేడులు అమర్చడం, కోళ్లను కట్టి ఉంచడం, గాయపడిన కోళ్లను ఒకదానిపై ఒకటి గాలిలో విసరడంలపై నిషేధం ఉందన్నారు. కోళ్లకు కట్టే కత్తులు అమ్మడం, ఒకరిపై ఒకరు రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడం నిషేధం అని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చట్టపరమైన నిబంధనలు మీరితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

నువ్వా.. నేనా.. సై

కోడి, ఖాకీల్లో గెలుపెవరిదో?


పాణింగపల్లి గ్రామంలో కోడిపందేల కోసం ఏర్పాటు చేసిన బరి

కె.గంగవరం: సంక్రాంతి పండగను సంతోషంగా చేసుకోవాలి. కోడి పందేలు, గుండాట, పేకాట వంటి జూద క్రీడలను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామంటూ గత నాలుగు రోజుల నుంచి రెవెన్యూ అధికారులు, పోలీసులు చేస్తున్న ప్రచారం అంతా ప్రకటనలకే పరిమితమైంది. కె.గంగవరం మండలంలోని పాణింగపల్లి, కె.గంగవరం, బోదిలంక గ్రామాల్లో బరులు ఇప్పటికే ఏర్పాటు చేశారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అయితే కోడి పందేల బరుల వద్ద గుండాట, ఇతర జూద క్రీడలు నిర్వహించేందుకు కూడా నిర్వాహకులు సిద్ధమయ్యారు. బరులు ముస్తాబు చేయడంలో నిర్వాహికులు నిమగ్నం కాగా పోలీసులు మాత్రం కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవంటూ ప్రకటనలు ఇప్పటికే చేస్తుండడం విశేషం. సంస్కృతి సాంప్రదాయాల్లో భాగంగానే కోడి పందేలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు చెబుతున్నా న్యాయస్థానం ఆదేశాల మేరకు కోడి పందేలు జరగనివ్వబోమని చెబుతున్న పోలీసుల వ్యవహారంలో కోడి గెలుస్తుందో లేక ఖాకీ గెలుస్తోందో వేచిచూడాల్సిందే.

మండపేటలో కోడి పందేలకు సర్వం సిద్ధం


గొల్లపుంత రోడ్డులోని ఒక లే అవుట్‌లో పందేల కోసం ఏర్పాటు చేసిన బరి

మండపేట: మండపేటలో కోడి పందేలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బరిలో దిగేందుకు కోళ్లను సిద్ధం చేశారు. ఇప్పటికే మండపేట, రూరల్ ప్రాంతాల్లోని మారేడుబాక, కేశవరం, ద్వారపూడి ప్రాంతాల్లో బరులు ఏర్పాటు ఏర్పాటు చేశారు కూటమి నేతల అండదండలతో ఎవరోస్తారో రానీ చూసుకుందాం అంటూ బరులు కట్టి పోలీసులకు సవాల్ విసురుతున్నారు. గొల్లపుంత రోడ్డులో ఒక లే అవుట్ లోనూ, మారేడుబాక పుంత రోడ్డులోనూ ఇప్పటికే పందెం రాయుళ్ల కర్రలతో బరులు కట్టారు. బరుల చుట్టూ ఇనుప కంచెను కూడా నిర్మించారు. ఇదిలా వుంటే పోలీసులు, రెవెన్యూ అధికారులు కోడి పందేలు పేకాట గుండాట జూదం వంటి ఆటలు ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బైండోవర్ కేసులు, సెక్షన్ 144, జంతు క్రూరత్వ నిరోధక చట్టం సెక్షన్లు అమలులో ఉన్నాయని హెచ్చరిస్తున్నారు. అంతేగాక గతంలో కోడి పందేలు జరిపిన ప్రదేశాలను గుర్తించి పోలీసు రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు సైతం పెట్టారు. అయితే అధికారుల ఆదేశాలు బేఖాతరు చేస్తూ పందెం రాయుళ్ల బరితెగించి బరులు సిద్ధం చేశారంటే ఏ స్థాయిలో నేతల అండదండలు ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని చెబుతున్నా లెక్క చేయకుండా బరులు ఏర్పాటు చేస్తున్నారు. పోలీసులకు పందెంరాయుళ్లకు మధ్య పోటీలో ఎవరు గెలుస్తారో చూడాలని ప్రజలు అనుకుంటున్నారు.

ఘనంగా వివేకానందుని జయంతి


పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న రామకృష్ణారెడ్డి, జనార్దనాచార్యులు


రామచంద్రపురంలో వివేకానందుని విగ్రహానికి నివాళులర్పించిన మురళి తదితరులు


కాజులూరులో యువకులు ఏర్పాటు చేసిన నీటి కుళాయి, పైపులైను నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

రాయవరం: వెదురుపాకలోని శ్రీగీతాజ్ఞాన మందిరం వద్ద ఆదివారం స్వామి వివేకానందుని జయంతిని నిర్వహించారు. జాతీయ యువజనోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల విద్యార్థులకు స్వామి వివేకానందుని జీవిత చరిత్రపై పోటీలు నిర్వహించారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త సత్తి రామకృష్ణారెడ్డి, విష్ణు సేన ట్రస్టు అధ్యక్షుడు అంగర జనార్దనాఆర్యులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో అధిక సంఖ్యలో చిన్నారులు పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు. చిత్రలేఖనంలో సీహెచ్.హన్విత, ఎం.భువన, ఎ.భార్గవ్‌లు, వ్యాసరచన సీనియర్ విభాగంలో ఎస్.లహరి, బి.రమ్యశ్రీ, కె.సుభాషిణిలు, జూనియర్ విభాగంలో కె.సత్యవిజయదుర్గ, ఎస్.జాహ్నవి, ఎం.వర్షిణిలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

పసలపూడి శ్రీనగర్‌లో తాడి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో స్వామి వివేకానందుని జయంతిని నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పసలపూడి మెయిన్ ప్రాథమిక పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ప్రగతి రామారెడ్డి, తాడి శ్రీనివాసరెడ్డి, గంగాధరరెడ్డి, భరత్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తి వివేకానంద

కాజులూరు: ప్రపంచంలోని మానవ వనరులను ముందుగా గుర్తించి, యువతను మేల్కొపిన స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద అని కాజులూరు పీఏసీఎస్ మాజీ చైర్మన్ యాళ్ళ వెంకటరమణ అన్నారు. ఆదివారం స్థానిక యువకులు కూటి రంజిత్‌కుమార్, గొర్రెల సుధాకర్, గుత్తాల రాంప్రసాద్ రూ.10 వేలు ఖర్చు చేసి గ్రామంలోని ఏఏ నగర్‌లో రామాలయంలో భక్తుల సౌకర్యార్థం నీటి కుళాయి, పైపులైను నిర్మాణం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన యాళ్ళ వెంకటరమణ, అన్యం శ్రీరామచంద్రమూర్తి తదితరులు మాట్లాడారు. వివేకానంద విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రామచంద్రపురంలో..

రామచంద్రపురం: భారతీయ సంస్కృతిని ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన స్వామి వివేకానందుడు నేటి యువతకు ఆదర్శం కావాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి ఎంఎం వెంకటరమణ అన్నారు. స్వామి వివేకానందుని జయంతి, జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని శివాలయం వీధిలోని వివేకానందుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ నాయకులు కూడా నివాళులర్పించారు.


పడమర ఖండ్రికలో వివేకానందకు నివాళులర్పిస్తున్న యువకులు

యువశక్తి దేశ ప్రగతికి చోదక శక్తి

కపిలేశ్వరపురం: సమాజాభివృద్ధిలో యువ శక్తి దేశ ప్రగతికి చోదక శక్తి అని వివేకానందుని జయంతి కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. పడమర ఖండ్రికలోని వివేకానంద నిలువెత్తు విగ్రహం వద్ద ఆదివారం అంగర, పడమర ఖండ్రిక గ్రామస్తులు నివాళులు అర్పించారు. తిరునాతి వెంకటేశ్వరరావు, ముత్తా త్రిమూర్తులు, దానేటి శరత్, మేడేపల్లి కనక రామకృష్ణ, మేడిద రాంబాబు, ఆలపాటి నారాయణమూర్తి, సంకాబత్తుల లోవరాజు మాట్లాడుతూ వివేకానంద బోధనలు ఆచరణయోగ్యమైనవన్నారు. విభిన్న కులాలు, మతాలు, సంస్కృతులు కలిగిన దేశంలో మానవ సమైక్యతే అభివృద్ధి ఆయుధమన్నారు.

విద్యార్థి వ్యక్తిత్వ వికాసానికి క్రీడలు దోహదం


జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలు ప్రారంభిస్తున్న విద్యాదాత పురుషోత్తం

మండపేట: విద్యార్థి వ్యక్తిత్వ వికాసానికి క్రీడలు ఎంతగానో దోహద పడతాయని విద్యాదాతగా పేరు పొందిన ప్రముఖ పారిశ్రామిక నామాల పురుషోత్తం అన్నారు. ఏడిద పోరస్ విల్లు ప్రాంగణంలో నామాల వీర్రాజు సీతారత్నం మెమోరియల్ ఆటలు పోటీలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ, ప్రైవేటుకు చెందిన 16 పాఠశాలల నుంచి విద్యార్థుల ఈ పోటీల్లో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా నామాల పురుషోత్తం విచ్చేసి క్రీడలను ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగేశ్వరరావు(నాగబాబు), గ్రామ ప్రముఖులతో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం క్రీడలను ప్రారంభించారు. పారిశ్రామిక వేత్త కొనగళ్ల సత్యనారాయణ, ఎంఈవో సోమిరెడ్డి, గ్రామస్తులు పర్వతిన వీర్రాజు, చిలుకూరు శ్రీనివాసరావు, పలివెల సుధాకర్, ఉపాధ్యాయులు ముంగర వెంకట్రాజు, సిద్ధాంతపు కృపారావు, రామకృష్ణ, విశ్రాంత ఉపాధ్యాయుడు గెడా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహా ప్రభో.. గ్రామ ఆరోగ్యాన్ని కాపాడండి..


అంగర గాంధీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

కపిలేశ్వరపురం: ‘మన గ్రామం – మన అభివృద్ధి’ పేరుతో గ్రామ ప్రధాన కేంద్రమైన గాంధీ సెంటర్‌లో గ్రామాభివృద్ధి కాంక్షకులు పేరుతో ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాలకు కనీసం ఒక డంపింగ్ యార్డునైనా ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని వ్యక్తం చేస్తూ మన గ్రామాన్ని మనమే అభివృద్ధి చేసుకోవాలన్న కర్తవ్యాన్ని ఫ్లెక్సీలో తెలియజేశారు. ఆలోచించండి, సహకరించండి, స్వార్థాలను విడనాడండంటూ డంపింగ్ యార్డు సాధన కోసం పోరాడడంలో ఐక్యత కొరవడటాన్ని వ్యంగంగా ఫ్లెక్సీలో వ్యక్తం చేశారు. ఇరు గ్రామాలకు డంపింగ్ యార్డులేకపోవడంతో టేకి కాలువ వెంబడి ఉన్న పీహెచ్‌సీ, ఉన్నత పాఠశాల చెంత చెత్తను డంప్ చేస్తున్నారు. దుర్గంధం వెదజల్లుతుండడంతో పాటు వ్యాధులు ప్రబలుతున్నాయి. ఇరు గ్రామాల ప్రజాప్రతినిధులు, పెద్దలు స్పందించి డంపింగ్ యార్డు ఏర్పాటు లక్ష్యాన్ని నెరవేర్చుకోవాలన్న లక్ష్యంగా ప్రదర్శితమవుతున్న ఫ్లెక్సీ ఫలితాన్విావాలని నిర్వాహకులు కాంక్షిస్తున్నారు.